# మానస భజరే గురు చరణం

గురు బ్రహ్మ గురు విష్ణుః గురుర్దేవో మహేశ్వరః

గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః

గురువు అనగా త్రిమూర్తి స్వరూపుడు. అనగా మనలో బ్రహ్మగా మంచి బీజములు నాటి, విష్ణు వలే వాటిని పోషించి, శివుడి రూపంలో దుర్గుణములను పారద్రోలు వాడు.

గురువు అనగా “గు”అంటే అంధకారము, “రు”అంటే నివారించు వాడు.

అటువంటి గురువునే పూజించే సంప్రదాయం భారతీయులది. పూర్ణమైన ప్రేమతో నిండిన దినమే పౌర్ణిమ.ఆషాఢ శుద్ధ పౌర్ణిమను “గురుపౌర్ణిమ” గా జరుపుకుంటారు. సాధకులు తమ ఆధ్యాత్మిక గురువులను ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఆరాధించి, కృతజ్ఞతలు ప్రకటించే పవిత్రమైన రోజు గురుపౌర్ణిమ



## వ్యాస పౌర్ణమి:

సత్యవతి పరాశర మహర్షి యొక్క కుమారుడు వ్యాసుడు. ఇతని అసలు పేరు కృష్ణద్వైపాయనుడు. భగవత్ తత్వాన్ని లోకానికి అందించుటకు అవతరించిన వాసుదేవుని అంశం కనుక వ్యాసుడు అని పేరు. వేద సారమును అందరికీ అర్థమయ్యే రీతిలో తెలిపినందువలన వేదవ్యాసుడు గా పేరు పొందాడు. నాలుగు వేదములే కాక అష్టాదశ పురాణములను, హిందూ సంస్కృతికి మూలమైన శాస్త్రము లన్నింటిని రచించినవాడు. భాగవతమును, మహాభారతమును రచించటమే కాక, కురువంశానికి మూల పురుషుడైనవాడు.

ఆయన నుండి అపారమైన జ్ఞాననిధిని పొందిన ఆయన శిష్యులు వ్యాసుడి వద్దకు వచ్చి" వారి యొక్క గురుభక్తిని, కృతజ్ఞత ను ఏ విధంగా తెలుపుకోవాలి"? అని అడిగారు. అప్పుడు వ్యాసమహర్షి సంవత్సరంలో ఒక పర్వదినాన్ని గురువులకు అంకితం చేసి, వారిపై భక్తిని, కృతజ్ఞతలు ప్రకటించుకోండి" అని తెలిపారు. అప్పుడు శిష్యులందరూ చేరి "చంద్రుడు పదహారు కళలతో పరిపూర్ణుడై ప్రకాశించు రోజు పౌర్ణిమ",వ్యాసుడు జన్మించినది ఆషాఢ శుద్ధ పౌర్ణమి.



వేద శాస్త్రము లకు మూలమయిన ఆది గురువు కనుక వ్యాస జన్మదినం “గురుపౌర్ణమిగా” మార్చి, గురువుకు కృతజ్ఞత తెలుపు రోజుగా ప్రకటించారు. ప్రతి యుగంలోనూ గురువులను గౌరవించు సాంప్రదాయాన్ని ఏర్పరచారు.



కృతయుగంలో దేవతలు వారి గురువైన బృహస్పతిని గౌరవించారు.త్రేతాయుగంలో శ్రీ రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు వారి గురువైన వశిష్టుల వారిని ఆరాధించారు.

ద్వాపరయుగంలో శ్రీకృష్ణ బలరాములు వారి గురువైన సందీప మహర్షి వద్ద విద్యనభ్యసించి, సముద్రంలో పడిపోయివున్న గురుపుత్రున్ని తీసుకుని వచ్చి తమ గురుభక్తిని ప్రకటించారు.సముద్రాన్ని దాటుటకు నావ ఎంత అవసరమో, భవసాగరాన్ని దాటుటకు గురువు అంత అవసరం. అందుకే భారతీయులందరూ సద్గురువును ఆశ్రయిస్తారు. భారతదేశం ఋషులు, మునులు, యోగులు, గురువులకి నిలయము. అటువంటి గురువులను గురించి తెలుసుకుందాము.



## ఆదిశంకరాచార్య - పద్మ పాదుడు

ఎనిమిదవ శతాబ్దములో కేరళలోని కాలడి అనే గ్రామంలో నంబూద్రి వంశమునకు చెందిన ఆర్యాంబ,శివగురువు దంపతుల కుమారుడు శంకరుడు. చిన్న వయస్సుననే తండ్రి మరణించగా, తల్లి ఎంతో ప్రేమతో పెంచెను. శంకరుడు బాల్యంనుండే వేదములను చదివిన ప్రజ్ఞాశాలి. శంకరుడు తన తల్లి పూర్ణానదికి స్నానానికి వెళ్లలేకపోవడం గమనించి, పూర్ణానదిని తమ పెరటిలో ప్రవహించమని ప్రార్థించి, నదిని ఇంటివద్దకే రప్పించెను.



ఒకరోజు శంకరుడు పూర్ణా నదిలో స్నానం చేయుచుండగా అతని పాదములను ఒక మొసలి పట్టి నీటిలోనికి లాగాగా శంకరుడు “అమ్మా! నన్ను మొసలి పట్టి లాగు చున్నది. నాకు మరణం తప్పదు” అని చెప్పెను. ఇది చూచి తల్లి ఎంతో భయపడెను. అప్పుడు శంకరుడు “అమ్మా! ఈ మరణ కాలమున సన్యసించుటకు అనుమతినిమ్మ” అని ప్రార్థించెను. ఎంతో అయిష్టతతో ఆర్యాంబ సన్యసించుటకు అనుమతిచ్చెను. వెంటనే శంకరుడు సన్యసించి దేశ యాత్ర చేయుటకై ఇల్లు వదిలి వెళ్ళెను.



వెళ్ళుటకు ముందు"తల్లి తనను ఎప్పుడ స్మరించునో అప్పుడు ఆమె వద్దకు వచ్చెదనని వాగ్దానం చేసి" తల్లిని సేవించుట బిడ్డల కర్తవ్యం అని లోకానికి చాటిచెప్పెను.

గురువుకై వెతుకుతూ నర్మదా నదీతీరంలో గోవింద భగవత్పాదాచార్యుల వద్ద శిష్యునిగా చేరి, ఏడు సంవత్సరములలో సకల వేదాంత రహస్యములను నేర్చుకునెను.

గురువాజ్ఞ పై కాశీనగరం చేరి అక్కడ పండితులతో వాదనలు చేసి వారందరిని జయించి అద్వైత సిద్ధాంతమయిన " జీవుడే బ్రహ్మము, బ్రహ్మమే జీవుడు" అని చాటి చెప్పెను.

శంకరుడికి వేదవ్యాసుడు దర్శనమిచ్చి దిగ్విజయయాత్ర చేయమని ఆదేశించగా భారతదేశమంతా పర్యటించెను. శంకరాచార్యుల వద్ద పద్మ పాదుడు అనే శిష్యుడుండేవాడు. అతని పేరు సనందుడు. గురు సేవ చేయటం అంటే ఆయనకు చాలా ఇష్టం.



చదువులో చాలా వెనకబడి ఉండేవాడు. అందువల్ల తోటి విద్యార్థులంతా చులకన చేసేవారు. ఒకరోజు సనందుడు గురువుగారి వస్త్రములు వుతికి నది మధ్య వున్న ఇసుక తిన్న పై ఆరబెట్టు చుండగా, హఠాత్తుగా నది పొంగి ఇసుక తిన్నెలను ముంచి వేసెను. ఇసుక తిన్నెలపై ఆరవేసిన బట్టలు నదిలో కొట్టుకుని పోవటం చూసిన సనందుడు, గురువు వస్త్రములను తెచ్చుటకు ప్రాణములను తెగించి నదిలో దిగెను. ఆశ్చర్యంగా అతను నడుచుటకు వీలుగా అడుగడుగునా పద్మములు ప్రత్యక్షం అయ్యెను. తన పాదము పెట్టిన ప్రతి చోట పద్మము ఏర్పడుట కళ్ళారా చూసిన శిష్యులందరికీ ఆశ్చర్యం కలిగెను. వారంతా అతనికి గురువుపై కల భక్తి విశ్వాసములే దానికి కారణమని తెలుసుకొనిరి. ఆ రోజు నుంచి అతడు పద్మపాదుడుగా పిలువబడెను. గురువుపై ఏకాగ్రచిత్తం మరియు అచంచల భక్తి విశ్వాసాలు కలిగి ఏ పనిచేసినా గురుకృప ఎళ్ళవేళలా ఉంటుందని నిరూపించాడు పద్మ పాదుడు.



## రామకృష్ణ వివేకానందులు

ఖుదీరామ్ చటోపాధ్యాయ, చంద్రమణి దేవి పుణ్యదంపతుల కుమారుడు రామకృష్ణ పరమహంస. ఆయన చిన్ననాటి పేరు గదాధరుడు. చిన్నతనం నుండే ఆధ్యాత్మిక విషయములందు ఎక్కువ ఆసక్తి చూపేవాడు.తండ్రి మరణానంతరం వారి కుటుంబము కలకత్తా వెళ్ళగా, అక్కడ దక్షిణేశ్వర క్షేత్రమున కాళీమాత దేవాలయము నందు ఆయన అన్నగారయిన రామ కుమారుడు పూజారిగా నియమింపబడిరి. కొంత కాలమనకు ఆయన అనారోగ్య కారణం వల్ల, రామకృష్ణునికి కాళిమాత ఆలయంలో అర్చకుడిగా నియమించిరి. రామకృష్ణుడు కాళీ విగ్రహమును మాతృమూర్తిగా భావించిరి. అతను నిరంతర సాధనకు కాళీమాత అనుగ్రహించి నిజరూపంతో దర్శనమిచ్చెను. ఈయన శిష్యులలో ముఖ్యమైన వారు స్వామి వివేకానంద, బ్రహ్మానందుడు మొదలగువారు. కంసాలి నగలు తయారు చేయుటకు బంగారమును అగ్నిలో కాల్చి ,సాగదీసి, ముక్కలుగా చేసి ఒక బంగారు ఆభరణము



ఎలా తయారు చేస్తాడో గురువు కూడా శిష్యున్ని అనేక విధములుగా పరీక్షించి, తగిన విధంగా హెచ్చరించి, సూచనలు ఇచ్చి ఆత్మజ్ఞానపరిపూర్ణునిగా రూపొందిస్తాడు. మరి అటువంటి సంఘటనను తెలుసుకుందాం. రామకృష్ణ పరమహంస శిష్యులలో ప్రతిదినము ఒకరు దక్షిణేశ్వరం నుండి కలకత్తాకు పడవలో వెళ్లి కావలసిన సరుకులు తెచ్చేవారు. ఒకరోజు బ్రహ్మానందం అనే శిష్యునికి ఆ వంతు వచ్చినది. అతను పడవలో గురుదేవుని స్మరిస్తూ కూర్చున్నాడు. ఆ పడవను ఎక్కిన ఒక పట్టణవాసి మిగిలిన ప్రయాణికులతో "ఇదిగో చూడండి. యితనికి మరియు యితని గురువుకి ఎటువంటి పని పాట లేదు. ఈ రామకృష్ణుడు కలకత్తా లోని యువకులందరినీ పాడు చేస్తున్నాడు." అంటూ హేళనగా మాట్లాడాడు.

బ్రహ్మానందం స్వతహాగా చాలా సరళ స్వభావి. గురునింద వినవలసి వచ్చినందుకు చాలా బాధపడినాడు. కానీ వారిని ఖండించే ధైర్యం లేకపోయింది.



ఆశ్రమం చేరిన తర్వాత గురువుతో పడవలో జరిగినదంతా చెప్పాడు. అది విన్న రామకృష్ణ పరమహంస అతనితో "గురునింద విని వూరుకోవడం మహాపాపం. ఇదేనా నీ గురుభక్తి" అని కోపంగా అన్నాడు. ఇదంతా స్వామి వివేకానంద వింటూ వున్నాడు. ఒకసారి వివేకానందుడు కలకత్తా వెళ్లవలసిన వంతు వచ్చింది. పడవలో ప్రయాణం చేస్తున్నాడు. ఎప్పటిలాగే ఒక వ్యక్తి రామకృష్ణున్ని అతని శిష్యులను నిందించటం మొదలుపెట్టాడు. వెంటనే వివేకానందుడు లేచి అతని వద్దకు వెళ్లి "మా గురువుగారిని హేళన చేస్తే వూరుకోను. పడవలో నుంచి నదిలోనికి నెట్టి వేస్తాను జాగ్రత్త" అని గద్దించాడు.

ఆశ్రమం చేరుకోగానే తన గురువు గారికి పడవలో జరిగినదంతా చెప్పాడు. రామకృష్ణ పరమహంస చాలా కోపంతో "ఛీ! ఛీ! ఇదేమి పని? కాషాయ వస్త్రం కట్టుకున్న వారికి అంత కోపం తగదు" అన్నాడు.



"వివేకానందునికి  గురువు గారి మాటలు ఏమి అర్థం కాలేదు. గురువును సమీపించి వినయ విధేయతలతో  " స్వామి! మీరు కొద్ది రోజుల క్రితం బ్రహ్మానందునితో గురునింద విని వూరుకోవడం మహాపాపం అన్నారు కదా. మరి నేను ఈ రోజు గురువుని నిందించిన వారిని, కోప్పడితే ఎందుకు ఇలా మాట్లాడుతున్నారు?

దయచేసి నా సందేహాన్ని తీర్చండి" అన్నాడు. రామకృష్ణ పరమహంస చిరునవ్వుతో "అందరికీ ఒకే ఉపదేశం ఇవ్వటం సాధ్యం కాదు. ఎవరికి తగినది వారికి ఇవ్వాలి. బ్రహ్మానందుడు సహజంగా సాత్విక స్వభావం కలవాడు. సమయ సందర్భాలను బట్టి కొంత పౌరుషం ప్రదర్శించాలి". కనుక అతనికి అలా చెప్పాను.



"నీవు సహజంగా ఉద్రేక స్వభావివి. నిన్ను కొంత శాంతపరిచే ఉపదేశం నీకు అందించవలసి ఉన్నది" అన్నాడు.

గురువు మార్గ సూచిక (Guide post) వంటివాడు. ఆధ్యాత్మిక  ప్రయాణంలో సాధకుని గమ్యం చేర్చుటకు సరైన మార్గాన్ని సూచించు వాడు.

శ్రీకృష్ణ పరమాత్మకు అర్జునుడెట్టి శిష్యుడో, శుకమహర్షికి జనకమహారాజు అట్టి శిష్యుడు.



ప్రాచీన ఋషులు షోడశ కళాపూర్ణుడయిన భగవంతుడిని గురువుగా విశ్వసించారు. అట్టి విశ్వగురువే భగవాన్ శ్రీ సత్య సాయి బాబా. స్వామివారి తాతగారైన కొండమ రాజుగారు మరియు వారి వంశీయుడు, గురువు అయిన వెంకావధూత సాధు సత్పురుషులకు సంరక్షించుటకు, ఈ విశ్వానికి వెలుగుబాటను చూపుటకు కలియుగంలో అవతరించమని శ్రీమన్నారాయణుని ప్రార్థించగా భగవాన్ శ్రీ సత్య సాయిబాబా వారు రత్నాకరవంశంలో, భారద్వాజ గోత్రంలో ఈశ్వరాంబా, పెద్ద వెంకమ్మ రాజుల తనయుడుగా అవతరించిరి. స్వామి మానవ రూపంలో మానవాతీత శక్తిగా అవతరించి, ఆధ్యాత్మిక గురువుగా తన పాత్రను చిన్ననాటినుండే ప్రారంభించారు.



1940 అక్టోబర్ 20వ తేదీన తాను "సాయిబాబాను"అని ప్రకటించి, "మానస భజరే గురుచరణం దుస్తర భవసాగర తరణం" అనే భజన ద్వారా "ఈ సంసార సాగరాన్ని దాటుటకు సద్గురు పాదాలను ఆశ్రయించండి" అని సందేశాన్ని ఇచ్చారు. గురుపౌర్ణిమకు ప్రశాంతి నిలయమునకు వచ్చిన భక్తులకు "గురువు అనగా గుణాతీతుడు, రూప రహితుడు. అట్టి గురువు భగవంతుడు ఒక్కడే" అని చెప్పారు.

1961వ సంవత్సరంలో గురుపౌర్ణిమ పర్వదినాన స్వామి ప్రభాత ప్రార్థన సుఖ శయన ప్రార్థనలను అందించారు. వాటి సారాంశం " నేను చేసే అన్ని కర్మలు పవిత్రమైనవిగావుంచి, మంచి మాటలు, మంచి చేతలు చేయించి, ఎవరిని బాధింపక, నేను బాధపడ కుండునట్లు నన్ను నడిపించుము. నేను చేసిన పనులన్నీ నీ ప్రేరణతోనే చేస్తున్నాను. ఈ దినము నా యొక్క వ్రతము పరిసమాప్తమైనది.నాకు చిర శాంతి, సుఖములను ప్రసాదించేది నీ ఒడి ఒక్కటే".



*1963వ సంవత్సరం జూన్ 29వ తేదీ* స్వామి శరీరానికి ఎడమవైపున



పక్షవాతం వచ్చినది. ఒక వారం రోజులు స్వామి యొక్క ఎడమ కాలు మరియు ఎడమ చేయి బిగించుకొని పోయి ఉన్నది. అది చూచిన భక్తులందరూ ఎంతో బాధపడసాగిరి. తర్వాత గురు పౌర్ణమి రోజు స్వామి" ఇది నాకు వచ్చిన జబ్బు కాదు. నేను తీసుకున్న జబ్బు. మీరెవరు బాధపడకండి" అని కస్తూరగారితో మైకులో చెప్పించారు. దాని సారాంశం ఏమనగా త్రేతాయుగంలో భారద్వాజ మహర్షి "సవిత్రా" యాగాన్ని చేయ నిశ్చయించుకుని, దానికి శక్తిని ఆహ్వానించుటకై కైలాసానికి వెళ్ళాడు.



అప్పుడు శివపార్వతులు నృత్యంలో తన్మయులై ఉన్నారు. భారద్వాజ మహర్షి పార్వతీ దేవి తన కోరిక విన్నవించుకోవటానికి 7 రోజులు వేచి ఉన్నాడు.

ఆ తర్వాత ఎడమ కాలు ఎడమ చేయి స్వాధీనం తప్పి చచ్చు పడిపోయాయి. అది చూచిన శివశక్తులు భారద్వాజ మహర్షిపై తమ కమండలంలోని నీటిని ప్రోక్షించి పూర్వస్థితిని కల్పించారు. అప్పుడు శివశక్తుల ఇద్దరూ "నీ యాగానికి తప్పక వస్తామని"వాగ్దానం చేశారు.



భారద్వాజ యాగం పూర్తి అయినది. శివ శక్తులు యిద్దరూ మహర్షి తో "భరద్వాజా! మేమిద్దరము కలియుగంలో నీ గోత్రం లో మూడు సార్లు అవతరిస్తాము.మొదట శివాంశగా శిరిడి సాయిబాబా రూపంలో,శివశక్తి అంశగా సత్యసాయి రూపంలో శక్తి అంశతో ప్రేమసాయి గాను అవతరిస్తాము" అని తెలిపిరి. ఇప్పుడు నీవు బాధపడి నట్టు గా, శివశక్తి అవతారమైన సత్యసాయి అవతారం లో ఏడు రోజులు బాధను అనుభవిస్తాము". అని తెలియజేసిరి.



తర్వాత స్వామి నీటిని తెప్పించి, కుడి చేతితో ఎడమ వైపు శరీరం పై మూడు సార్లు చల్లారు. మరుక్షణం లేచి నిలబడి "ప్రేమస్వరూపలారా!" అంటూ భక్తులనుద్దేశించి ఒక గంట సేపు ఉపన్యాసం ఇచ్చారు.

ఈ అద్భుత సన్నివేశం ద్వారా తమ శివశక్తి అవతార రహస్యమును స్వామి  గురుపౌర్ణిమ రోజు తెలియజేశారు.

1986వ సంవత్సరము గురుపౌర్ణమినాడు స్వామి తమ భక్తులనుద్దేశించి "నేను మీకు పంచాక్షరీ మహామంత్రం కానీ, అష్టాక్షరీ మహా మంత్రం కానీ ఉపదేశించటం లేదు. దే-వు-డు-న్నా-డు అన్న పంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశిస్తున్నాను. భగవంతుడు ఉన్నాడు. దీనిని మీరు మరవకండి. బాగా తెలుసుకుని ఆచరించండి.ఈ మహా మంత్రాన్ని అందరికీ చెప్పండి"అన్నారు.మరియు"ఉన్నాడయా దేవుడున్నాడయా కన్నులకు కనిపించకున్నాడయా" అన్న గేయాన్ని పాడారు."దేవుడున్నాడు. కంటికి కనిపించకుండా తెరచాటున వుండి ఈ జగన్నాటకాన్ని ఆడిస్తున్నాడు.



అని ఈ పాట ద్వారా తెలియజేశారు. 1970 వ సంవత్సరంలో గురు పౌర్ణమి నాడు స్వామి తన భక్తులకు 5 సాధనాంశములను నిర్దేశించారు. అవి:1.నిశ్శబ్దత 2. పరిశుభ్రత 3. సేవ 4. ప్రేమ 5. అద్వేష్టా సర్వభూతానాం

సజ్జనుల సాంగత్యము చేరి, పుణ్య కార్యములను చేసి, ఏది నిత్యము? ఏది అనిత్యము? అని విచారణ చేయమని తెలిపారు.




1988వ సంవత్సరంలో గురు పౌర్ణమి రోజు “ఉన్నది దైవం ఒక్కడురా! దేవుడి మరువకురా! హెచ్చుసంపదలు వచ్చినగాని ఏనుగు గుఱ్ఱము నెక్కిన కానీ దేవుని వదలకురా” అన్న గేయాన్ని పాడి, కీర్తి ప్రతిష్ఠల కొరకు ప్రాకులాడే మానవాళికి వారి యొక్క నిజ తత్వాన్ని తెలియజేసిన విశ్వగురువే శ్రీ సత్య సాయిబాబా. దేహాత్మ బుద్ధితో అంధకారంలో ఉన్నవారికి దేహం యొక్క నిజ తత్వాన్ని తెలియజేసిన విశ్వగురవు శ్రీ సత్య సాయి బాబా.

అంతేకాకుండా "సత్య ,ధర్మ, శాంతి, ప్రేమలతో నీ నిత్య జీవనయాత్ర సాగించు" అంటూ ఈ మానవతా విలువలను సాధనములుగా చేసుకుని నీ జీవన యాత్రను సాగించమని సెలవిచ్చారు.

ఆ గురువు చూపిన బాటలో గమ్యాన్ని చేరు కోవడమే మన జీవిత లక్ష్యం. కనుక ఇప్పటి నుండి మన మనసులను ప్రేమమయం చేసుకుందాము. సత్య ధర్మ శాంతి ప్రేమ అహింసలను నిలబెట్టి విశ్వశాంతిని నెలకొల్పుదాము.

భుక్తి విద్యలన్ని బోధించి తెలిపేటి

గురువు లెల్ల పరము కూర్ప గలరా?

ముక్తి విద్య తెలిపి మోహంబు తెగటార్పు

గురువు కలడు సత్య గురువరుండు.

మనల్ని ఉద్ధరించడానికి అవతరించిన విశ్వ గురువు శ్రీ సత్య సాయి నాధుని చరణారవిందములకు అంజలి ఘటిద్దాము.



సమస్త లోకాః సుఖినో భవంతు